దుర్వాసన భరించలేక..

- అక్రమంగా ప్లాస్టిక్ దానా తయారీ కేంద్రం నిర్వహణ
- రాత్రివేళల్లో దుర్వాసనతో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



బుద్వేల్‌లో అక్రమంగా కొనసాగుతున్న పరిశ్రమ

రాజేంద్రనగర్: ప్లాస్టిక్ దానా తయారీ కేంద్రం నుంచి వచ్చే దుర్వాసనతో బుద్వేల్, కిస్మత్‌పూర్ వాసులు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో దుర్వాసన కారణంగా ఊపిరి పీల్చేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుద్వేల్ ఈసీ వాగు పక్కనే కొన్ని రోజుల క్రితం ప్లాస్టిక్ గోదామును ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకే ఈ గోదాములో భారీ యంత్రాలను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకువచ్చి శుభ్రపరుస్తున్నారు. అనంతరం వీటితో దానా తయారు చేస్తున్నారు. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా పెద్ద ఎత్తున దానా తయారు చేస్తూ వాటి నుంచి వెలువడే వాయువులను గాలిలోకి వదిలి వేస్తున్నారు. దీంతో బుద్వేల్‌తో పాటు కిస్మత్‌పూర్ బస్తీ, కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ సదరు గోదాములో ప్లాస్టిక్ డంపింగ్ యార్డు కొనసాగేది. కొన్నాళ్ల క్రితం ఆదే ప్రాంతంలో భారీ షెడ్డు వేసి యంత్రాలను బిగించి ఈ దానా తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దుర్వాసనతో శ్వాసకోశ వ్యాధుల బారినపడుతున్నామని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంలో రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భూగర్భ జలాలు కలుషితం...

నగరంలోని పలు ప్రాంతాల్లో సేకరించిన ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను ఇక్కడికి తీసుకువచ్చి మిషన్ల ద్వారా శుభ్రపరుస్తున్నారు. ఈ నీటిని పక్కనే ఉన్న ఈసీ కాలువలోకి వదిలి వేస్తున్నారు. దీంతో ఈసీ వాగు పూర్తిగా కలుషితమవుతోంది. ఈ ప్రాంతంలో చెక్‌డ్యామ్ ఉండడంతో ఈ నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి.

పరిశ్రమకు అనుమతులు లేవు...

ప్లాస్టిక్ దానాతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రపరిచేందుకు కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతి తీసుకోవాలి. అయితే ఈ పరిశ్రమకు ఎలాంటి అనుమతి లేదని జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. స్థానికులు సమస్యను ఫోన్ ద్వారా తమ దృష్టికి తీసుకువచ్చారని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

"తగు చర్యలు తీసుకుంటాం

పరిశ్రమ విషయమై రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ జగన్‌ను వివరణ కోరగా పరిశ్రమ నిర్వహణకు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. ఏఎంహెచ్‌వోను పరిశ్రమ వద్దకు పంపించి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. నివాస ప్రాంతాల్లో ఇలాంటి పరిశ్రమల నిర్వహణను ఉపేక్షించేది లేదన్నారు.
– సర్కిల్ ఉపకమిషనర్ జగన్

అధికారులు సమన్వయంతో పని చేయాలి


మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: అధికారులు సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన కార్పొరేషన్ పరిధిలోని విద్యుత్, జలమండలి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు, థర్డ్ వైరింగ్, ట్రాన్స్‌ఫార్మర్లు, వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి డివిజన్ల వారీగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న మంచినీటి పైపులైన్ పనులు, లో ప్రెషర్, వాటర్ బిల్లులు తదితర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సహకారంతో కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. అధికారులు, ప్రజలు ఇందుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, భూపాల్‌గౌడ్, తలారి చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, ముద్దం రాము, గోపాల్‌ముదిరాజ్, నాగరాజు, సయ్యద్ ఖాజా, పాండు, టీంకురెడ్డి, రజాక్, డిప్యూటీ ఇంజినీర్ యాదయ్య, అసిస్టెంట్ ఇంజినీర్లు శ్రీనివాస్, నరేందర్, రాజీవ్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన రహదారులకు మరమ్మతులు


రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు చేస్తున్న సిబ్బంది

రాజేంద్రనగర్: గోతులమయమైన రోడ్లకు యుద్ధప్రాతిపదికన ఎప్పటికప్పుడు ప్యాచ్‌వర్క్ పనులను చేపడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోహంద్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ, అత్తాపూర్, రాంబాగ్, శివానగర్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో గోతులమయమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వాహనాలు వెళ్లడంతో ఏర్పడ్డ గోతులను పూడ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీటీ మిశ్రమంతో ప్యాచ్‌వర్క్ పనులను చేపడుతున్నామన్నారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకుని ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దు

శంషాబాద్: మాంసం వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు సూచించారు. మాంసం, చికెన్ దుకాణాల నిర్వాహకులతో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాంసం, చికెన్ వ్యర్థాలను వీధికుక్కల కోసం రహదారులపై వేయడంతో అనర్థాలు జరుగుతున్నాయన్నారు. నిబంధనల ప్రకారం మాత్రమే మాంసం వ్యర్థాలను తరలించడం లేదా పూడ్చిపెట్టడం చేయాలన్నారు.. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, పారిశుద్ధ్యవిభాగం అధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు

క్లుప్తంగా

అభినందనలు


కానిస్టేబుల్ రాజశేఖర్‌ను సత్కరించిన రామకృష్ణారెడ్డి

మణికొండ: మూడు రోజుల క్రితం ఆరాంఘర్ చౌరస్తాలో గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్ రాజశేఖర్‌ను మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి అభినందించారు. మంగళవారం ఆయనను బండ్లగూడలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయస్ఫూర్తితో వ్యవహరించి ఓ నిండు ప్రాణాన్ని కాపాడటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బి. శ్రీరాములు, శ్రావణ్‌కుమార్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులను శిక్షించాలి


ఆరెమైసమ్మ చౌరస్తాలో ప్రీతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బండ్లగూడ: ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న గిరిజన వైద్య విద్యార్థిని ప్రీతి మరణం బాధాకరమని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు కొండే మహేష్‌యాదవ్, కార్పొరేటర్ భూపాల్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆరెమైసమ్మ చౌరస్తాలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిందితుడు సైఫ్‌కు తెలంగాణ పోలీసులు కఠిన శిక్ష విధించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పి.ఎస్.మల్లారెడ్డి, కోమరం నర్సింహ్మా, సాయిరెడ్డి, గోపిగౌడ్, నరేష్‌యాదవ్, శివగౌడ్, చంద్రశేఖర్, ప్రదీప్, శ్రీకాంత్, రవినాయక్, జైసింగ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రాయి పడి వ్యక్తి మృతి


కృష్ణ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు


మృతుడు కృష్ణ(ఫైల్)

మణికొండ: ఓ నిర్మాణ సంస్థలో సెల్లార్ గుంత తీసేందుకు క్రషింగ్ చేస్తున్న వ్యక్తి తలపై ప్రమాదవశాత్తు రాయి పడటంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నార్సింగి ఎస్సై మురళి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నార్సింగిలో ఓ నిర్మాణ సంస్థ అపార్ట్‌మెంట్ నిర్మాణపనుల్లో భాగంగా 40 అడుగుల లోతులో సెల్లార్ తీస్తోంది. ఈ సందర్భంగా తొలగించిన రాళ్లను పక్కనే కుప్పగా పోశారు. మంగళవారం వాటి పక్కనే ట్రాక్టర్‌తో క్రషింగ్ పనిచేస్తున్న కృష్ణ (35) తలపై ఓ పెద్ద పడటంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నల్గొండ జిల్లా చిట్యాల మండలం, పెద్దకాపర్తి గ్రామానికి చెందిన వాడని అతని బంధువులు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని అతని బంధువులు సంఘటనా స్థలంలో ఆందోళనకు దిగారు. సంఘటనా స్థలానికి చేరుకున్న నార్సింగి పోలీసులు వారిని సముదాయించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కంటి వెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


ఆదర్శనగర్ కాలనీలో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: ప్రజలకు కంటి సమస్యలు లేకుండా చూసేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు పథకానికి శ్రీకారం చుట్టారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఆదర్శనగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటి వెలుగు కేంద్రాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా కేంద్రాలకు వచ్చి కంటి పరీక్షలు చేయించుకుంటున్నట్లు తెలిపారు. నాయకులు, అధికారులు ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. మార్చి 16 వరకు ఈ కేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు. ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులు, కళ్లద్దాలను అందజేస్తారన్నారు. అవసరం ఉన్న వారికి ఆపరేషన్‌లు సైతం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు, సభ్యులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ దక్షిణమండలం జోన్ ఇన్‌చార్జి కమిషనర్ అలివేలు మంగతాయారు

రాజేంద్రనగర్: అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ దక్షిణమండలం జోన్ ఇన్‌చార్జి కమిషనర్ మంగతాయారు అన్నారు. అగ్ని ప్రమాదాల నియంత్రణ చర్యలపై రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం వ్యాపారులు, పలు సంస్థల నిర్వాహకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు, సంస్థల నిర్వాహకులు భద్రతాచర్యలు తీసుకోవాలన్నారు. ఫైర్ సేఫ్టీ లేని సంస్థల్లో వారం రోజుల్లో నిబంధనల మేరకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అగ్నిమాపక విభాగం సమన్వయంతో ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, అగ్నిమాపక శాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, సర్కిల్ ఏఎంహెచ్‌వో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జగదీశ్వర్ సేవలు ఎనలేనివి


జగదీశ్వర్ దంపతులను సన్మానిస్తున్న రిజిస్ట్రార్, అధికారులు

ఏజీవర్సిటీ: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పని సరి అని విధి నిర్వహణలో మనం చేసే పని ఇతరులు గుర్తుంచుకునేలా ఉండాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఆర్ జగదీశ్వర్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వర్ దంపతులను ఘనంగా సన్మానించారు. డాక్టర్ జగదీశ్వర్ విశ్వవిద్యాలయానికి చేసిన సేవలను కొనియాడారు. నూతనంగా ఏర్పాటైన వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పరిశోధన ఫలాలను రైతులకు అందించేందుకు ఆయన అహర్నిషలు కృషి చేశారని కొనియాడారు. డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎటువంటి అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. మనం చేసే పనులే మన అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


రాఘవేంద్ర(ఫైల్)

రాజేంద్రనగర్: ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్వేత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లంగర్ హౌస్ ప్రాంతానికి చెందిన కుమ్మరి రాఘవేంద్ర(24) లిఫ్ట్ మెకానిక్‌గా పని చేసేవాడు. తన బావ ఇంట్లో ఉంటూ హైదర్‌గూడ లోటస్ స్కూల్ ప్రాంతంలోని లిఫ్ట్ మెకానిక్ కార్యాలయంలో పని చేస్తున్నాడు. సోమవారం డ్యూటీకి వచ్చిన అతను రాత్రి కార్యాలయం గదిలోనే నిద్రకు ఉపక్రమించాడు. మంగళవారం ఉదయం 9 గంటలైనా గదిలో నుంచి బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన యజమాని అక్కడికి వెళ్లి చూడగా రాఘవేంద్ర ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టేడియం నిర్మాణ పనుల పరిశీలన

మణికొండ: మున్సిపాలిటీ కేంద్రంలో కొనసాగుతున్న స్టేడియం నిర్మాణ పనులను మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో యువకులకు మంచి ఆట స్థలాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ల్యాంకోహిల్స్ పక్కన క్రికెట్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇందుకు రూ. కోటి వెచ్చించి అత్యాధునిక వసతులు కల్పిస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు జె. సిద్దప్ప, నాయకులు బి.రవికాంత్‌రెడ్డి, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి


కార్మికులతో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

మణికొండ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ప్రతి ఉద్యోగిని పర్మనెంట్ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి. జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మణికొండ మున్సిపల్ కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యావసర ధరలు పెరుగుతున్నాయని, ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు ఇస్తున్న జీతం ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలన్నారు. ఎన్నికల్లోగా కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య, మండల కార్యదర్శి స్వామి, సీపీఐ మండల కార్యదర్శి బాబురావు, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ డే


ఆవిష్కరణలను తిలకిస్తున్న రాధాకిషన్‌రావు

మణికొండ: జాతీయ సైన్స్‌డే సందర్భంగా వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థినులు, సైన్స్, హ్యూమానిటీస్ అనే అంశంపై నమూనాల ప్రదర్శన, సెమినార్లు నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ కె.రాధాకిషన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు, సెమినార్లతో విద్యార్థులకు నూతన ఆవిష్కరణలపై అవగాహన కలుగుతుందన్నారు. ఇతరులు తయారు చేసిన నమూనాలను చూసి మరింత నేర్చుకునే అవకాశముంటుందన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం, భద్రత, వైద్యం, గేమింగ్ రంగం, నానో, బయోటెక్నాలజీ, వైర్‌లెస్ విద్యుత్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్రెండ్స్ తదితర వినూత్న నమూనాలను తిలకించి ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎల్ మల్లీశ్వరి, హెచ్‌ఓడీ డాక్టర్ కేసీ రవికుమార్, ఎవాల్యుయేషన్ డైరెక్టర్ డాక్టర్ వై. కృష్ణారెడ్డిలతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో...

గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ప్రొఫెసర్ ఎం. ఘనశ్యామ్‌కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సెమీ కండక్టర్, సెన్సార్ల ప్రాముఖ్యత ఇంజినీరింగ్, టెక్నాలజీ విద్యార్థులకు అవి ఎలా ఉపయోగపడతాయనే విషయంపై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. చంద్రమోహన్‌రెడ్డి, హెడ్ ఆఫ్ ఫిజిక్స్, కెమిస్ట్రీ డాక్టర్ రవిచందర్, ఇతర విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మణికొండ ప్రభుత్వ పాఠశాలలో...

మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇస్రో శాస్త్రవేత్త మృత్యుంజయ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో ..

మణికొండ: మణికొండలోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో మంగళవారం సైన్స్‌డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాలల ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మనిషి జీవితంలో సైన్స్ ఎంతో ముఖ్యమైనదని, ప్రకృతి పరమైన ప్రక్రియల వెనక ఉన్న సైన్స్‌ను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రతి ప్రయోగంతో కొత్త విషయం తెలుస్తుందని, ఇలాంటి ఉత్సవాలు, ప్రదర్శనల్లో విరివిగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ, అకడమిక్ డీన్ రేష్మ, వైస్ ప్రిన్సిపాల్ సౌమ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

శ్రీ చైతన్య పాఠశాలలో..


నమూనాలను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్వేత

రాజేంద్రనగర్: హైదర్‌గూడ శ్రీ చైతన్య పాఠశాలలో నేషనల్ సైన్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రనగర్ సీఎస్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్వేత మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుద్వేల్ లిటిల్ మాధవి స్కూల్‌లో ..

రాజేంద్రనగర్: విద్యార్థులు విజ్ఞాన వంతులుగా ఎదిగేందుకు అన్ని రంగాల్లో వారిని తీర్చిదిద్దాలని లిటిల్ మాధవి స్కూల్ సొసైటీ ప్రెసిడెంట్ జగన్నాథ్, ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని మంగళవారం బుద్వేల్‌లో లిటిల్ మాధవి స్కూల్‌లో విద్యార్థులు తయారు చేసిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. వారిలోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


బుద్వేల్ లిటిల్ మాధవి స్కూల్‌లో నమూనాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం


బాధితుడు టింకుపాండేను పరామర్శిస్తున్న రుద్రకుమార్

మైలార్‌దేవ్‌పల్లి: కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని కాటేదాన్ క్లస్టర్ కన్వీనర్ రుద్రకుమార్ అన్నారు. కాటేదాన్‌లోని వేజయ్ పోలీ ప్యాక్ పరిశ్రమలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన టింకుపాండే సోమవారం సాయంత్రం ఆలస్యంగా విధులకు హాజరైనందుకు పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బంది అతడిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడన్నారు. మంగళవారం బాధితుడిని పరామర్శించిన సీఐటీయూ నేతలు మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం కార్మికుడికి చికిత్స చేయించాలని, వేతనం అందించాలని, అతడిని రెగ్యులర్ కార్మికుడిగా గుర్తించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్ చేరుకున్న ఉమ్రా యాత్రికులు



శంషాబాద్: ఉమ్రా యాత్ర పూర్తి చేసుకున్న యాత్రికులు మంగళవారం సాయంత్రం హైదారాబాద్‌కు చేరుకున్నారు. శంషా బాద్ విమానాశ్రయలో వారి కుటుంబసభ్యులు, బంధువుల, స్నేహితులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. పుష్ప గుచ్ఛాలు అందజేసి సన్మానించారు. ఇరవైరోజుల క్రితం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన మొత్తం 80 యాత్రికులు ఉమ్రా యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకున్నట్లు నిర్వాహకులు ఫయాజ్ అలీ తెలిపారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోహంద్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. హైదర్‌గూడ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్ ప్రాంతంలో కొనసాగుతున్న డ్రైనేజీ పనులను భారతీయ జనతా పార్టీ యువజన నాయకుడు బుద్దాల చిన్నతో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదన్నారు. చాలా ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పాడైపోయిందన్నారు. దీంతో డ్రైనేజీ నీరు మంచినీటిలో కలుస్తున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో అధికారులతో చర్చించి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కొత్త పైపులైన్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ యువజన నాయకుడు బుద్దాల నర్సింగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.